# గుట్ట దారిలో రాయగిరి అందాలు

**యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వెళ్లేదారిలో రాయగిరి గ్రామంలో ఉన్న పెద్ద చెరువు రాయగిరి చెరువు ఒక అద్భుత పర్యాటక కేంద్రంగా మారింది. చెరువు చుట్టుపక్కల అరణ్యాలు, శిల్పారామం ఏర్పాటుతో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు రాయగిరి చెరువు వద్ద కాసేపు సేదతీరుతున్నారు.**

*–యాదగిరిగుట్ట, డిసెంబర్14*



రాయగిరి చెరువు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించడమే కాకుండా చుట్టుపక్క ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారు. యాదగిరిగుట్ట మాత్రమేకాదు ఆ చుట్టుపక్కల ప్రాంతమంతా పర్యాటక కేంద్రాలతో విలసిల్లుతున్నది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి సులభంగా చేరుకునేందుకు రహదారి విస్తరించడమే కాదు రోడ్డు పక్కనే అభయారణ్యాలు నిర్మించారు. రాయగిరి నుంచి ఆలయం వరకు కిలోమీటర్ల రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు.

**రెండెకరాల్లో మినీ శిల్పారామం**

**భక్తులు సేద తీరేందుకు ఫుట్‌పాత్**

## ఫౌంటెయిన్లు, బోటింగ్‌తో ఆహ్లాదకరంగా చెరువు



చిన్నారుల ఆటస్థలం

### వాటర్ ఫౌంటెయిన్లు.. బోటింగ్

భక్తులు రాయగిరి చెరువును వీక్షించేందుకు వైటీడీఏ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నాలుగు చోట్ల వాటర్ ఫౌంటెయిన్లను నిర్మించింది. చెరువులో నీళ్లు ఆకాశాన్ని తాకేలా మహాద్భుతంగా తీర్చిదిద్దారు. చెరువులో బోటింగ్ చేసేందుకు ప్రత్యేకమైన బోటింగ్‌ను సిద్ధం చేశారు. ఒక బోటులో ఇద్దరు కూర్చునేలా సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు.



రాయగిరి చెరువుకట్ట ఫుట్‌పాత్‌పై సేద తీరుతున్న భక్తులు



మినీ శిల్పారామంలో చిన్నారుల ఆటస్థలం



మినీ శిల్పారామంలో చిన్నారుల ఆటస్థలం



### మినీ శిల్పారామం..

రాయగిరి చెరువు అలుగు పోసే ప్రాంతంలో రెండెకరాల్లో శిల్పారామాన్ని అద్భుతంగా నిర్మించారు. 1.20 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపట్టగా పరిసరాలన్నీ పచ్చదనంతో వెల్లివిరిసేలా గ్రీనరీ ఏర్పాటు చేశారు. శిల్పారామంలోకి ప్రవేశించే మార్గంలో స్వాగతతోరణం నిర్మించారు. పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేద తీరేందుకు మైదానాన్ని సిద్ధం చేశారు. విభిన్న రుచులతో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశారు. చెరువు మధ్యలో ఐలాండ్, పక్కనే వంతెన వంటి నిర్మాణాలతోపాటు బోటింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ఎటుచూసినా చక్కటి పల్లె వాతావరణం వెల్లివిరిసేలా నిర్మించారు. రాత్రివేళల్లో పరిసరాలన్నీ జిగేల్ అనిపించేలా రాయగిరి ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. శిల్పకళా, హస్తకళా వైభవం ఉట్టిపడే విధంగా రాయగిరి చెరువు ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు.

# మొక్కవోని దీక్ష

**హరితహారం కోసం గ్రామాల్లో మొక్కల పెంపకం**

- జిల్లాలో 42.18లక్షల మొక్కలు లక్ష్యం
- ఈ ఏడాది కొత్తగా 3.49లక్షల సీడ్
- నర్సరీల్లో 30రకాల మొక్కల పెంపునకు ప్రణాళిక
- 418 గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న పనులు
- నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



బీబీనగర్ మండలం నెమరుగొమ్ములలో కొనసాగుతున్న నర్సరీ పనులు

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : హరిత తెలంగాణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఏటా లక్షల మొక్కలు నాటుతూ అడవుల శాతాన్ని పెంచుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం దూర దృష్టితో గ్రామాలు, పట్టణాల్లోనే నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గ్రామపంచాయతీలు, పట్టణాల్లో ప్రత్యేక నిధులతో నర్సరీలు ఏర్పాటయ్యాయి. ఆయా పంచాయతీ, పట్టణాల్లో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో మూడు గ్రామ పంచాయతీలు మినహా 418 జీపీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. సాయినగర్ పోచంపల్లి, లప్పునాయక్‌తండా, బీఎన్‌తిమ్మాపూర్ మినహా అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటుతున్నారు. ఒక్కో నర్సరీలో పాతవి, కొత్తవి కలిపి కనీసం 10వేల మొక్కలు ఉండేలా ప్లాన్ చేశారు. ఇందులో కొత్తవి ఆరు వేలు తగ్గకుండా ప్రణాళిక రూపొందించారు. మొత్తంగా జిల్లాలో 42,18,249 మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో కొత్తవి 3,490,434 సీడ్ ఉండగా, గతేడాదివి, కన్వర్షన్ కలిపి మరో 7,59,815 మొక్కలు ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా తుర్కపల్లి మండలంలో 3,79,849 మొక్కలు నాటారు. ఆ తర్వాత బీబీనగర్, బొమ్మలరామారం మండలాల్లో 3.40 లక్షల చొప్పున, వలిగొండలో 3,38,400, భువనగిరిలో 3.30 లక్షలు, నారాయణపురంలో 3.10 లక్షల చొప్పున మొక్కలు పెంచనున్నారు.

### నర్సరీల సంరక్షణకు చర్యలు

నర్సరీల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పశువుల నుంచి రక్షణ కోసం నర్సరీల చుట్టూ గోడను నిర్మించి గేట్లను ఏర్పాటు చేశారు. మొక్కలకు ఎండ బారి నుంచి రక్షణ కోసం షేడ్ నెట్లను అమర్చారు. మొక్కలు చిన్నగా ఉండి నాటే సమయంలో చనిపోయే ప్రమాదం ఉండటంతో విత్తనాలు మొలకెత్తే దశలోకి వచ్చిన తర్వాత మరింత రక్షణ కోసం పాలిథిన్ కవర్లలోకి మారుస్తున్నారు. మొక్కల సత్వర ఎదుగుదలకు కావాల్సిన నాణ్యమైన మట్టి, ఎరువుల మిశ్రమాన్ని కలిపి విత్తనాలు నాటిస్తున్నారు.

### 30 రకాల మొక్కలు..

ఆయా నర్సరీల్లో అధికారులు రకరకాల మొక్కలు పెంచుతున్నారు. పండ్లు, పూలు, నీడనిచ్చే సుమారు 30 రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జామ, అల్లనేరేడు, చక్రమల్లె, మందారం, నేరేడు, మల్లె, చామంతి, వాటర్ ఆపిల్, గన్నేరు, నూరు వరహాలు, మైదా, గులాబీ, గుల్‌మోహర్, పెల్టో ఫోరం, దానిమ్మ, కానుగ, పారిజాతం, టెకోమా, శ్రీగంధం, నెమలినార, వేప, కదంబ, నిద్రగన్నేరు, బాదాం, బోహమియా, స్పతోడియా, చింత, సీతాఫలం, నరేఫా, సిల్వియా తదితర మొక్కలను పెంచుతున్నారు. రకరకాల మొక్కలతో నర్సరీలు పచ్చదనం పరుచుకొని చిట్టడవిని తలపిస్తున్నాయి.



కొనసాగుతున్న నర్సరీ పనులు

### 42.18 లక్షల మొక్కలు టార్గెట్..



యాదాద్రి భువనగిరి జిల్లాలోని 418 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. మొత్తంగా 42,18,249 మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో కొత్తగా 3,490,434 సీడ్ వేశాం. మిగిలినవి గతేడాదివి ఉన్నాయి. వివిధ రకాల మొక్కలు పెంచుతున్నాం. నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా ప్రత్యేకంగా సంరక్షణ చర్యలు చేపట్టాం.

– నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

# చెరుకు సాగుతో లాభాల బాట

**కట్టంగూర్ మండలంలో 200 ఎకరాలకు పైగా సాగు**

**చెరుకు సాగును నమ్ముకున్న రైతులు లాభాల బాట పడుతున్నారు. ఈ పంట సాగుతో లాభాలు తప్ప నష్టం ఉండదని సాగు చేసిన రైతులు చెబుతున్నారు. ఒక్కసారి పంట సాగు చేస్తే మూడేండ్ల వరకు విత్తనం వేసే పని ఉండదని పేర్కొంటున్నారు. ఈ పంట సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్న రైతులను ఆదర్శంగా తీసుకొని మండలంలోని ఎంతోమంది రైతులు అదే బాటలో నడుస్తున్నారు.**

*– కట్టంగూర్, డిసెంబర్ 14*

కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం, దుగినవెల్లి, మాణిక్యాలమ్మగూడెం, సవుళ్లగూడెం, ఎరసానిగూడెం, కల్మెర, బొల్లేపల్లి, ఈదులూరు గ్రామాల్లో 200 ఎకరాలకు పైగా రైతులు చెరుకు పంటను సాగు చేస్తున్నారు. బోరుబావుల ఆధారంగా ఆయా గ్రామాల్లోని రైతులు గత ఐదు ఏండ్లుగా చెరుకు సాగు చేసి మంచి లాభాలు పొందుతున్నారు. చెరుకు సాగు చేసిన రైతులు చెరుకును కత్తిరించిన తరువాత ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని చెరుకు ఫ్యాక్టరీకి లారీల ద్వారా తరలిస్తున్నారు. టన్ను చెరుకు ధర రూ.3,200 వరకు అమ్ముతూ లాభాలు ఆర్జిస్తున్నారు.



మాణిక్యాలమ్మగూడెంలో ఏపుగా పెరిగిన చెరుకు

### ఒక్కసారి నాటితే మూడేండ్ల వరకు పంట

రైతులు ఒక్కసారి చెరుకు నాటితే మూడేండ్ల పాటు పంట ఉంటుంది. మరోసారి మొక్క నాటాల్సిన అవసరం ఉండదు. ఎకరం సాగు చేసేందుకు రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుంది. చెరుకు మొక్క నాటిన నుంచి 12 నెలల తరువాత పంట కోతకు వస్తుంది. చెరుకు నాటిన తరువాత మనిషి లోతు కాగానే జడ కట్లు కడుతారు. చెరుకు నాటిన తరువాత ఎరువులు, సాగునీటిని సకాలంలో అందిస్తే ఏపుగా పెరుగుతుంది. ఎకరానికి 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి రావడంతో పెట్టుబడి పోగా ఎకరానికి రూ.లక్షకు పైగా ఆదాయం పొందుతున్నారు.

### చెరుకు సాగుతో అధిక లాభం



వరి సాగు చేస్తే కష్టంతోపాటు పెట్టుబడి ఎక్కువ, లాభాలు తక్కువగా వచ్చేవి. ఆంధ్రా రైతుల సలహా మేరకు గత ఆరేండ్లుగా 2 ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నా. చెరుకు పంటకు సకాలంలో అడుగు పిండి, నీరందిస్తే మంచి దిగుబడి వస్తుంది? నాకున్న నీటి వసతి రెండెకరాల చెరుకు పంటకు సరిపోతుంది. ఎకరానికి 60 నుంచి 70 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.3,200చొప్పున ఖమ్మం జిల్లాకు చెందిన కంపెనీ వాళ్లు తీసుకెళ్తున్నారు. ఎక్కువ పెట్టుబడి లేకుండానే చెరుకుసాగులో సంతృప్తికరమైన లాభాలు పొందుతున్నా.

–కాడింగ్ భీమయ్య, రైతు, మాణిక్యాలమ్మగూడెం

# ఎడమ కాల్వకు ఈసారి నీళ్లు లేనట్టే..

- యాసంగి వరి సాగుకు నీటి విడుదల కష్టం
- అడుగంటిన నాగార్జున సాగర్ జలాశయం
- నల్లగొండ ఉమ్మడి జిల్లాలో 3,94,262 ఎకరాల ఆయకట్టు
- బోర్లు, బావులను నమ్ముకుంటున్న రైతులు



మిర్యాలగూడ/హాలియా, డిసెంబర్ 14 : కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది వర్షాలు అతి తక్కువగా కురువడంతో తెలంగాణ, ఆంధ్రా పరిధిలో జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీరు స్వల్పంగా చేరింది. దాంతో ప్రాజెక్టుల్లో సరిపడా నీరు లేకపోవడంతో సాగునీటి ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ కింద ఎడమ కాల్వకు నీరు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించే అవకాశం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో మేజర్ల కింద 3,03,350 ఎకరాల ఆయకట్టు ఉండగా.. 41 ఎత్తిపోతల పథకాల కింద 90,912 ఎకరాలు ఉన్నది. మొత్తం 3,94,265 ఎకరాలకు సాగునీరు అందేది. రెండు తెలుగు రాష్ట్రాల అవసరాల మేరకు 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకునేందుకు ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో 510 అడుగుల కంటే నీటి మట్టం తగ్గితే హైదరాబాద్ ప్రజల కోసం అందించే తాగునీటిపై ప్రభావం చూపే పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కృష్ణా బేసిన్‌లో వర్షాలు తక్కువగా పడడంతో తెలుగు రాష్ట్ర పరిధిలోని ప్రాజెక్టులకు సుమారు 150 టీఎంసీల నీరు మాత్రమే ఇన్‌ఫ్లో వచ్చింది. భారీ ఇన్‌ఫ్లో ఉంటేనే రెండు తెలుగు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో లేకపోవడంతో సాగునీటి అవసరాలను పక్కకు పెట్టారు. ఈ క్రమంలోనే సాగర్ ఎడమ కాల్వ కింద సాగునీటిని విడుదల చేయలేదు. యాసంగి వరిసాగుకు కూడా నీటి విడుదల పరిస్థితి లేకుండాపోయింది.

### సుమారు 75 వేల ఎకరాల్లో బోరుబావుల కింద వరి సాగు

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో బోర్లు, ఊట బావుల ద్వారా రైతులు సుమారు 75 వేల ఎకరాల్లో యాసంగి వరి సాగు చేస్తున్నారు అందుబాటులో ఉన్న నీటి వనరు ఆధారంగా స్వల్పకాలిక వరి వంగడాలను నాటు వేస్తున్నారు. ఆయకట్టుకు మూడు నెలలపాటు సరిపడా విద్యుత్ అందితేనే వరిసాగు గట్టెక్కనుంది.

### బీళ్లుగా మారనున్న 3.19 లక్షల ఎకరాలు

నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో పదేండ్ల తరువాత రైతుల భూములు సుమారు 3.19 లక్షల ఎకరాలు బీళ్లుగా మారనున్నాయి. యాసంగి సీజన్‌లో కేవలం నీటి ఆధారంగానే మెట్ట పంటలైన వేరుశనగ, కంది, పెసర, మినుము వంటి పంటలు పండిస్తారు. సాగర్ ఆయకట్టులో ఈ పంటలు పండించేందుకు రైతులకు నీటి వసతి లేకపోవడంతో ఆయకట్టు పూర్తిగా బీళ్లుగా మారే పరిస్థితి ఉంది. ఆయకట్టులో కేవలం నీటి వసతి ఉన్న 75 వేల ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేస్తున్నారు. 3.19 లక్షల ఎకరాల్లో నీటి వసతి లేకపోవడం వల్ల మెట్టపంటలు కానీ, వరి కానీ సేద్యం చేసే పరిస్థితి లేకుండా పోయింది.

### వరి బదులు మెట్ట పంటలే మేలు..

ఆయకట్టు పరిధిలో రైతులు ఎక్కువగా వరిసాగు వైపు దృష్టి సారిస్తున్నారని, మెట్ట పంటలు సాగు చేస్తేనే ఎక్కువ మొత్తంలో భూమిలో పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కాగా, సాగర్ ఆయకట్టు పరిధిలో వరి మినహా ఇతర పంట లేవీ ఆశించిన స్థాయిలో గతంలో దిగుబడి రాకపోవడంతో నీటి వసతి ఉన్న రైతులు వరి సాగు వైపు దృష్టి సారిస్తున్నారు.

### నాగార్జునసాగర్ ఆయకట్టు వివరాలు

*ఉమ్మడి జిల్లా ఆయకట్టు – 3,03,353 ఎకరాలు*

*41 ఎత్తిపోతల ఆయకట్టు– 90,912 ఎకరాలు*

*మొత్తం – 3,94,265 ఎకరాలు*

### సాగర్ నీటిమట్టం 522.30 అడుగులు

నందికొండ : నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 590(312.50 టీఎంసీలు) అడుగులకు గానూ గురువారం నాటికి 522.30 అడుగులకు చేరుకొని 153.5035 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ నుంచి ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,350 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో లేదు.